- మైలేజీ కోసం వైసీపీ తాపత్రయం
- గత ప్రభుత్వ తప్పిదాలు కప్పిపుచ్చేందుకు తంటాలు
- టీడీపీపై నిందలు
- తిప్పికొట్టిన టీడీపీ
- ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలని మంత్రి పిలుపు
- వాడివేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాసమస్యలపై గరంగరం



సమావేశానికి హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ శివశంకర్, అన్నమయ్య జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్ తదితరులు

కడప(రూరల్), జూలై 9: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రజాసమస్యలపై గరంగరంగా కొనసాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.20 నిమిషాలకు ప్రారంభమైంది. రాష్ట్ర రవాణాశాఖ మంత్రితో పాటు టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ హాజరయ్యారు. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి నేతలే ప్రతిపక్ష హోదాను కొనసాగించి ప్రజాపక్షాన నిలబడ్డారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తదితరులు ప్రజా సమస్యలను వాడీవేడిగా సభకు వినిపించి అధికారుల నుంచి సమాధానాలను రాబట్టారు. వైసీపీ ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు తంటాలు పడ్డారు. టీడీపీపై నిందలు వేయడానికి పోటీపడ్డారు.

ప్రోటోకాల్ మీరు పాటించారా..?



రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. తనకు తెలియకుండానే టీడీపీ నేత బాలసుబ్రమణ్యం అధికారులతో సమావేశం నిర్వహించడం ఏంటని, ఏ హోదాలో నిర్వహించారని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. మీ వరకు వచ్చేసరికి బాధ కలిగిందా.. మీ వైసీపీ పాలనలో పులివెందులలో ఇలాంటి అవమానాలను ఎన్నో భరించామన్నారు. ఏనాడైనా ప్రోటోకాల్ పాటించారా అప్పుడు గుర్తుకు రాని విషయాలు మీరు ప్రతిపక్షంలో ఉంటే గుర్తుకు వస్తాయా అని ఘాటుగా ప్రశ్నించారు.

కక్షసాధింపులు మాకు తెలియవు

చక్రాయపేట జడ్పీటీసీ తమ మండలంలో కాలేటి వాగు ప్రాజెక్టును నిర్మిస్తున్నారని కక్షసాధింపు చర్యలకు పోకుండా టీడీపీ ప్రభుత్వం పనులను పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కక్షసాధింపులు తమ ప్రభుత్వానికి తెలియవని అలాంటి పనులు మీరు చేసినా తాము చేయమన్నారు. ప్రాజెక్టు పనులను ఏదో కంపెనీ చేస్తోందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు జరగకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎస్.పాలగిరిలో కొండవాగుపై కాంట్రాక్టరు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారని ఇందుకు సంబంధించిన బిల్లులు గత వైసీపీ ప్రభుత్వంలో కాలేదని ఇప్పుడైనా మంజూరు చేయించాలని కోరారు. దీనిపై కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేసి ఉంటే తప్పకుండా బిల్లులు వస్తాయన్నారు.

మీ పాలనలో 90 శాతం దౌర్జన్యాలు

వైసీపీ జడ్పీటీసీ శివప్రసాదర్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం తప్పు చేయడం వలనే ప్రజలు తమ పార్టీని ఓడించి మీకు అధికారాన్ని అప్పగిస్తే మీరు నెల రోజుల పాలనలోనే భయభ్రాంతులకు లోనుచేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మీ పాలనలో 90 శాతం దౌర్జన్యాలు చేశారన్నారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో ఉన్న డీలర్‌షిప్‌లను, విద్యావలంటీర్లను, మధ్యాహ్నభోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులను, గ్రీన్ అంబాసిడర్లను ఇతర ప్రభుత్వశాఖలలో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి వైసీపీ కార్యకర్తలకు ఇచ్చుకున్నారని ఇలాంటి పనులు తమవల్ల కావన్నారు. తమ పాలనలో ఎక్కడో కింది స్థాయిలో ఒకటి అర జరిగినట్లు తమకు తెలిస్తే అలాంటి వాటికి తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ అధికారం చేపట్టాక.. డిసెంబరులో అమ్మఒడి



సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా ఇంతవరకు తల్లికివందనం కింద టీడీపీ ప్రభుత్వం డబ్బు ఇవ్వలేదని విమర్శించారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 2019 జూలైలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమ్మఒడిని ఎప్పుడు ఇచ్చారని డీఈవోను ప్రశ్నించగా అదే ఏడాది డిసెంబర్‌లో ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుపెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని జడ్పీటీసీకి చురకలు అంటించారు. సమావేశంలో జడ్పీ శాఖ తప్ప అన్నిశాఖలపై చర్చిస్తున్నారని జడ్పీ శాఖలోని నిధుల ఖర్చుపై కూడా చర్చించాలన్నారు.

గత ప్రభుత్వంలో నాశిరకం మినుములు



గత వైసీపీ ప్రభుత్వంలో 2023 రబీలో నాశిరకం మినుములు, శనగలను సరఫరా చేశారని అదే పార్టీకి చెందిన వీఎన్‌పల్లె ఎంపీపీ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వమైనా మంచివి ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రధానమంత్రి పసల్ బీమా పథకంలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఎత్తివేసిందని దానిని తిరిగి కొనసాగించాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంలో 2019కి ముందు రిజిస్ట్రేషన్ అయిన భూములకు మాత్రమే పీఎం కిసాన్ అందుతోందని ఆ తరువాత భూములకు కూడా అందించాలన్నారు. చక్రాయపేట జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో వరినాట్లు జరుగుతున్నాయని ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ తమది రైతుల పక్షపాత ప్రభుత్వమన్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

అక్రమ పింఛన్లపై ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ఫైర్



గత వైసీపీ పాలనలో అక్రమ పింఛన్లు కోకొల్లలుగా ఇచ్చారని మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఫైర్ అయ్యారు. ప్రధానంగా వికలాంగుల పింఛన్లు అక్రమంగా ఉన్నాయన్నారు. చెవుడుకు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు ఇస్తున్నారని వీటి సహాయంతో పింఛన్లు పొందుతున్నారన్నారు. ఫిజికల్ హ్యాండిక్యాప్డ్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలని అలాగే అధికారులపై విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఉచిత ఇసుకపాలసీపై అవగాహన కల్పించారు. గత వైసీపీ పాలనలో గ్రావెల్, ఇసుక అక్రమంగా తరలిపోయిందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

విద్యుత్‌శాఖ చర్చలో పలువురు జడ్పీటీసీలు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరుబావులకు విద్యుత్ సరఫరా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుంచి రైతుల బోరుబావులకు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయని కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, పశుసంవర్ధక శాఖల చర్చలో జడ్పీ వైస్ చైర్మన్-2 బాలయ్య, పోరుమామిళ్ల, బి.కోడూరు, సిద్దవటం, కమలాపురం, బద్వేలు జడ్పీటీసీలు, చెన్నూరు, బి.మఠం ఎంపీపీలు మాట్లాడారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు తదుపరి జరిగే సమావేశంలో సమాధానాలతో అధికారులు రావాలన్నారు. జిల్లా అభివృద్ధికి అందరం కలిసి పాటుపడాలన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

సమావేశం ప్రారంభం కాగానే మంత్రి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఇటీవల ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. అనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను మంత్రి సత్కరించారు.

ప్రేక్షక పాత్ర వహించిన చైర్‌పర్సన్

జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ జె.శారద సమావేశానికి అధ్యక్షత వహించారే కానీ ఆద్యంతం ఆమె ఒక్క మాట కూడా మాట్లాడకుండా ప్రేక్షకపాత్ర పోషించడం పలువురిని విస్మయానికి గురిచేసింది. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, కడప, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు గణేశ్‌కుమార్, ఫర్మాన్‌అహ్మద్, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నవ్విపోదురు గాక మాకేంటి...!

- 80 నిమిషాలు ఆలస్యంగా జడ్పీ సమావేశానికి
- వైసీపీ నేత హోటల్‌ను కాపాడేందుకు చైర్‌పర్సన్ చాంబర్‌లో చర్చ

కడప(రూరల్) జూలై 9: నవ్విపోదురు గాక మాకేంటి సిగ్గు.. మా ప్రయోజనాలే మాకు ముఖ్యం అన్నట్లుగా వైసీపీ నేతలు వ్యహరించిన తీరు పలువురిని విస్మయానికి గురిచేసింది. వైసీపీ నేతల నిర్వాకంతో ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన జడ్పీ సర్వసభ్య సమావేశం 11.20 గంటలకు ప్రారంభమైంది. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన జిల్లా అధికారులు నిర్దేశించిన సమయానికి హాజరయ్యారు. కానీ వైసీపీ నేతలు మాత్రం జడ్పీ సమావేశంపై చిన్నచూపు చూశారు. వైసీపీకి చెందిన ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు, జడ్పీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ జె.శారద, జడ్పీ వైస్ చైర్మన్-2 పి.బాలయ్య, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్‌రామాంజనేయరెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డితో పాటు పలువురు సీనియర్ జడ్పీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు ఉదయం 10.20 నుంచి 11.10 వరకు జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో భేటీ అయ్యారు. కడప నగర నడిబోడ్డులోని రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలంలో వైసీపీ కార్పొరేటర్ భర్త తుంగా రవీంద్రనాథరెడ్డి(ఐస్‌క్రీం రవి) అనుమతులు లేకుండా నిర్మించిన హోటల్‌ను కాపాడేందుకు సుదీర్ఘంగా చర్చించారు. ఈ మేరకు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నేత రాజేశ్, జడ్పీ సీఈవో ఎం.సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో ఎం.రమణారెడ్డిలను పిలిపించుకున్నారు. సదరు విషయం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం అక్కడ కేసులు నమోదు చేయడంపై కాస్త కఠినంగా మాట్లాడినట్లు సమాచారం. వైసీపీ నేత హోటల్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అధికారులకు హుకుం జారీచేసినట్లు తెలిసింది. అనంతరం వీరంతా 11.20 నిమిషాలకు లోనికి రావడంతో జడ్పీ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. సమావేశం ముగింపు సమయంలో వైసీపీ నేత తుంగా రవీంద్రనాథరెడ్డి అనుమతులు లేకుండా నిర్మించిన రూ.2 కోట్ల విలువచేసే జడ్పీ స్థలాన్ని నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘానికి కేటాయిస్తూ వైసీపీ జడ్పీటీసీలు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

వైసీపీ నేతలా మజాకా

- జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో ప్రెస్‌మీట్
- ప్రభుత్వంపై విమర్శలు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘనవిజయం సాధించి రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టినా ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకా వైసీపీ నేతల హవా కొనసాగుతూనే ఉంది. మంగళవారం జడ్పీ సమావేశ కార్యాలయంలో ఒకపక్క కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీలు, ఇతర జిల్లా అధికారులు ఉండగానే.. జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు (కడప నగర మేయర్) సురేశ్‌బాబు, వైసీపీ నేత తుంగా రవీంద్రనాథరెడ్డి (ఐస్‌క్రీం రవి) తదితర నేతలు మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి టీడీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. టీడీపీ అధికారం చేపట్టిన 20 రోజులకే అభూత కల్పన చేస్తోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుకను అందిస్తామని చెప్పి ఇప్పుడు ట్రాక్టర్ ఇసుకకు రూ.1500లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. జడ్పీ చైర్‌పర్సన్ మాత్రమే ఉపయోగించుకోవాల్సిన చాంబర్‌లో వైసీపీ నేతలు మీడియా సమావేశం ఏర్పాటుచేయడం పలు విమర్శలకు దారితీస్తోంది. ఈ విషయంపై వివరణ కోరేందుకు జడ్పీ సీఈవోను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.



జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, చిత్రంలో ఐస్‌క్రీం రవి తదితరులు

ప్రజలకోసం కట్టుబానిసలం



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- ప్రజాసంక్షేమమే మా అజెండా
- హింస, దౌర్జన్యాలను దరిదాపుల్లోకి కూడా రానివ్వం
- తప్పుచేసిన వారిని తప్పకుండా చట్టం శిక్షిస్తుంది
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప(రూరల్), జూన్ 9: ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాలలో 164 స్థానాలను కూటమికి కట్టబెట్టి దేశంలో ఎవరికీ దక్కని గౌరవాన్ని ప్రజలు తమకు ఇచ్చారని.. ఇలాంటి ప్రజలకోసం కట్టుబానిసల లాగా పనిచేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ హాలులో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాసంక్షేమమే తమ అజెండా అన్నారు. ఎల్లప్పుడు ప్రజలతోనే మమేకమై ఉంటామన్నారు. హింస, దౌర్జన్యాలను, తప్పుడు విధానాలను దరిదాపుల్లోకి కూడా రానీయమన్నారు. ఏవిధమైన దుశ్చర్యలకు పాల్పడమన్నారు. గత ప్రభుత్వ పాలనలో తప్పుచేసిన వారిని చట్టం తప్పకుండా శిక్షిస్తుందన్నారు. స్మగర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమన్నారు. కూటమి ప్రభుత్వం 30 రోజుల పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉండడానికి వీలైన అన్నిరకాల చర్యలను చేపడుతోందన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నడూ లేని రీతిలో జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాపక్షాన కొనసాగించామన్నారు. జడ్పీ పాలకమండలికి పూర్తి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రాద్ధాంతాలకు తావులేకుండా ఉమ్మడి కడప జిల్లాలో రాబోయే కాలంలో ప్రజల అభివృద్ధికి ఏవిధమైన చర్యలు తీసుకోవాలి అనేదానిపై చర్చించామన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజాపక్షపాతంగా ఉంటుందన్నారు. రెండు జిల్లాల్లో రాబోయే కాలంలో ప్రజలకు ఏఏ అవసరాలు ఉన్నాయో వాటిని గుర్తించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కడప, అన్నమయ్య జిల్లాలకు కలెక్టర్లను, జేసీలను యువకులను వేశారన్నారు. చురుకుగా అభివృద్ధి చేయాలన్నదే సీఎం ఉద్దేశ్యమన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అమలు

తాము ఏమైతే చెప్పామో వాటిని ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. జూలై 1న 65 లక్షల మందికి పింఛన్లు అందించామన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్నారు. ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చామన్నారు. పక్క రాష్ట్రాలకు, పక్క ప్రాంతాలకు ఒక్క పిడికెడు కూడా ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్మగ్లర్లను, యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌ను ప్రోత్సహించమన్నారు. 70 శాతం మంది వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడిన 3 రోజుల్లోనే సీఎం పోలవరాన్ని సందర్శించారని అన్నారు. అనతి కాలంలోనే పోలవరాన్ని పూర్తిచేసి రైతులకు స్వర్ణయుగం తీసుకొస్తామన్నారు. ఎవరైతే ప్రజలకు మంచిచేస్తారో వారికే మళ్లీ ప్రజలు పట్టం కడతారన్నారు. స్థానిక సంస్థలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి వాటికి పూర్వవైభవాన్ని తీసుకొస్తామన్నారు.

విద్యాభివృద్ధే ఏకైక లక్ష్యం

- ఇన్‌చార్జ్ ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరించిన శామ్యుల్



ఇన్‌చార్జి ఆర్జేడీ శామ్యుల్‌కు పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఈవో అనురాధ

కడప(ఎడ్యుకేషన్), జూలై 9: జోన్-4 పరిధిలో విద్యాభివృద్ధే ఏకైక లక్ష్యమని పాఠశాల విద్య ఇన్‌చార్జి ప్రాంతీయ సంచాలకులు కె.శామ్యుల్ పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం ఆర్జేడీ కార్యాలయంలో ఆయన ఇన్‌చార్జి ఆర్జేడీ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన కె.శామ్యుల్‌ను డీఈవో అనురాధ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. గుంటూరు జిల్లా బాపట్ల మండలం కర్లపాలెంకు చెందిన కె.శామ్యుల్ 2008లో మదనపల్లె ఉప విద్యాధికారిగా విధుల్లో చేరారు. 2010లో చిత్తూరు ఇన్‌చార్జి డీఈవో (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టారు. అక్కడ నుంచి నాలుగున్నరేళ్ల పాటు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. 2017లో నెల్లూరు జిల్లా రెగ్యులర్ డీఈవోగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. 2023లో మోడల్ స్కూల్స్‌కు డిప్యూటీ డైరెక్టరుగా, అదే ఏడాది పల్నాడు డీఈవోగా పనిచేశారు. ఈ ఏడాది కర్నూలు డీఈవోగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఎఫ్ఏసీ ఆర్జేడీ బాధ్యతలు చేపట్టారు.

పౌరసరఫరాల శాఖలో అనధికార ఘనుడిపై వేటు

- 12 ఏళ్లుగా చక్రం తిప్పిన ప్రైవేటు ఆపరేటర్

ప్రొద్దుటూరు, జూలై 9: ప్రొద్దుటూరు పౌరసరఫరాల విభాగంలో ఎన్నో ఏళ్లుగా అనధికారికంగా చక్రం తిప్పుతున్న ఘనుడిపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు వేటు వేశారు. ఈనెల 6 తేదిన 'పౌరసరఫరాల శాఖలో అనధికార ఘనుడు' పేర ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దారు సుదర్శన్ విచారణ జరిపారు. ప్రొద్దుటూరు పౌరసరఫరాల విభాగంలో అనధికారికంగా జి.శివప్రసాద్ ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా 12 ఏళ్లగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన ఆన్‌లైన్ చేయటం, ఎండీయూ ఆపరేటర్ల ఆథెంటికేషన్స్‌ను మార్పులు చేయడం, క్లస్టర్లలో రేషన్ కార్డుల మ్యాపింగ్‌లు చేయడం లాంటి పనులతో పాటు సివిల్ సప్లయ్ విభాగం పనులన్నింటికి సంబంధించి ఇతనే కరస్పాండెంట్ చేసేవాడని గుర్తించారు. ఇటీవల తహశీల్దారు అనుమతులు లేకుండా రైస్‌కార్డుల మ్యాపింగ్‌తో పాటు డీలర్ల పేరు మార్పు ఎండీయూల పేరు మార్పులను ఆన్‌లైన్‌లో చేసినట్లు ధ్రువీకరించారు. అందువల్ల శివప్రసాద్‌ను కార్యాలయం నుంచి గెంటివేసినట్లు వారు కలెక్టరుకు నివేదిక పంపారు.

కాగా పౌరసరఫరాల విభాగంలో ఆర్ఐ సాయిప్రసాద్ ఉన్నప్పటికి ఫైల్స్ అన్నీ ఈ అనధికార ఉద్యోగే చూసేవాడు. రెగ్యులర్ ఉద్యోగులు ఆదాయాలమీద మాత్రమే దృష్టి పెట్టి పేపర్ వర్కు, కంప్యూటర్ వర్కు అంతా ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్ మీదకు వదిలేయటం వలన ఇతనే మొత్తం ఆ విభాగంలో చక్రం తిప్పుతూ వచ్చాడు. ముఖ్యంగా డీలర్లకు సరుకు అలాట్ మెంటు దగ్గర నుంచి గోడౌన్ వరకు ఇతనే చూసేవాడు. దీనితో పాటు డీలర్లపై అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు, ఫిర్యాదులు వస్తే అధికారులతో పాటు ఇతన్ని వెంటబెట్టుకుని దాడులకు వెళ్లేవారు. కేసులు రాయడం, టైపింగ్ పనులు కూడా ఇతనే చేసేవాడు. డీలర్లకు ముందస్తు సమాచారం ఇచ్చి వారిని 6-ఏ కేసుల నుంచి కాపాడినట్లు అతనిపై ఆరోపణలున్నాయి. దీంతో కార్యాలయంలో ఆ విభాగం మొత్తం అతను లేనిదే పనిచేయలేని పరిస్థితి నెలకొంది. 12 ఏళ్లగా రెవెన్యూ విభాగంలో ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌గా ఒక్క రూపాయి జీతం తీసుకోకుండానే కేవలం మామూళ్ల మీదనే ఇతను ఇంత కాలం నెట్టుకు రావడమే కాకుండా ఆస్తులు కూడా కూడబెట్టాడని ఆరోపణలున్నాయి.

జ్యోతి గ్రామంలో ఇసుక రీచ్ పరిశీలన



ఇసుక రీచ్ పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి

సిద్దవటం, జూలై 9: మండలంలోని జ్యోతి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లను కడప ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అనుమతిలేని చోట ఇసుకను తవ్వి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి ఉన్న రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని తెలిపారు. రీచ్‌ల వద్ద ఎల్లవేళలా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, ప్రతి ఇసుక వాహనానికి రవాణా బిల్లు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మురాద్వావలీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనూరాధ, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతి సెక్రెటరీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజు తనిఖీలు చేయండి

- క్రమశిక్షణ కమిటీ సమావేశంలో ఏవో రవికుమార్

వేంపల్లె, జూలై 9: ఇకపై ప్రతిరోజు, ప్రతి బిల్డింగ్ వద్ద సెక్యూరిటీ గార్డులు తనిఖీలు నిర్వహించాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఏవో పెనుగొండ రవికుమార్ ఆదేశాలు జారీచేశారు. మంగళవారం తెల్లవారుజామున విద్యార్థుల హాస్టల్ గదుల్లో ఆయన అకస్మిక తనిఖీలు నిర్వహించారు. పరిపాలన అధికారి, సెక్యూరిటీ ఆఫీసర్, సెక్యూరటీ కేర్‌టేకర్‌తో సహా పది మంది ఫ్యాకల్టీతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైస్ కుక్కర్లు, హీటర్లు, ఐరన్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల ట్రిపుల్‌ఐటీలో గంజాయి కలకలం రేపడంతో సీరియస్‌గా తీసుకున్నారు. ఈ సందర్భంగా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ ఆఫీసర్ శర్వాన్, వార్డన్ కోనప్ప, క్రమశిక్షణ కమిటీ సభ్యులు వీరరాఘవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వినోద్, కార్తీక్, బ్రహ్మం, సెక్యూరిటీ కేర్ టేకర్స్ 20 మంది సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వాగులు, వంకలను కలిపేసి.. లేఅవుట్లు






రంపతాడు గ్రామ పరిధిలో కాలిబాటను కలిపేసుకొని నిర్మించిన కాంపౌండ్ వాల్, ప్రహరీ పక్కన ఏర్పాటు చేసిన కాలిబాట, కాల్వను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడ, వెల్లటూరులో అనుమతులు లేకుండా వేసిన వెంచర్

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు
- ప్లాట్లుకొనుగోలు చేస్తున్న అమాయక జనం
- అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ అసలే ఉండవు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

పెండ్లిమర్రి, జూలై 9: రోజురోజుకు కడప నగరం నలుదిశలా విస్తరిస్తోంది. దీనికి తోడు కడప నుంచి పులివెందులకు వెళ్లే ప్రధానరహదారి వెంబడి రియల్ వెంచర్లు ఇబ్బడి ముబ్బడిగా వేశారు. ఈ రహదారిలోనే యోగి వేమన యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, కొప్పర్తి పారిశ్రామికవాడ ఉండడంతో ఇక్కడి భూములకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా భావించి రియల్టర్లు పెండ్లిమర్రి మండలం పరిధిలో వెంచర్లు వేశారు. ఇక్కడ సెంటు లక్ష నుంచి పది లక్షల రూపాయల వరకు ధరపలుకుతోంది. దీంతో రియల్టర్లకు ఈ ప్రాంతం స్వర్గధామంగా మారింది. యూనివర్సిటీ చుట్టూ డీకేటీ భూములు ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ సిబ్బంది సహకారంతో వాటిని కొట్టేసి వెంచర్లు వేసి కోట్లు దండుకుంటున్నారు. నిన్నటిదాకా పచ్చని పంట పొలాలతో కలకలలాడిన భూములు ఇప్పుడు వెంచర్లుగా మారి సరిహద్దులు రంగురాళ్లతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు.

లేఅవుట్ వేయాలంటే....

గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనల ప్రకారం లేఅవుట్లలో రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్, పచ్చదనం పెంపు, కమ్యూనిటీ హాల్, ప్రార్థన మందిరాలు తదితర వాటికి స్థలాలు కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్‌ప్రాంతం ఉన్న గ్రామపంచాయతీకి ఫీజు చెల్లించాలి. వ్యవసాయ భూముల్లో లేఅవుట్లువేస్తే ముందుగా రెవెన్యూ వారికి దరఖాస్తు చేసుకొని రుసుం చెల్లించి ల్యాండ్‌కన్వర్షన్ చేయించుకోవాలి. అయితే ఇక్కడ వెలుస్తున్న లేఅవుట్‌లో ఎక్కడ కూడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వాగులను, వంకలను కలిపేస్తూ...

రంపతాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 217, 218, 196లలో 9.70 ఎకరాలలో ప్రైవేట్ వెంచర్ వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి కాలిబాట ఉంది. ఈ వెంచర్‌కు కాలిబాట అడ్డురావడంతో దాన్ని ఆక్రమించేసి ప్రహరీగోడ నిర్మించారు. కాలిబాటను ప్రభుత్వ భూమిలోకి మళ్లించారు. యూనివర్సిటీకి ఆనుకొని మల్లయ్యపల్లె వంక నుంచి అల్లాడుకుంట చెరువుకు నీరు వచ్చే కాల్వను కూడా ఆక్రమించేశారు. ఈ చెరువు కింద రైతులకు సాగుభూమి కూడా ఉంది. వెంచర్‌లో కాలిబాట, కాల్వ కలిసి దాదాపు 45సెంట్లు భూమిని ఆక్రమించేశారని స్పందన కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికి రెవెన్యూ అధికారులు స్పందించలేదు. వెంచర్లు వేసేటపుడు కనీసం ఆగ్రామ పంచాయతీల తీర్మానాలు కూడా తీసుకోకుండానే వేస్తున్నారు.

శ్మశానాన్ని కలిపేసుకొని...

యోగివేమన యూనివర్సిటీ సమీపంలో సుమారు 50 ఎకరాల్లో వెంచర్‌వేశారు. ఇక్కడ వాగును, శ్మశానాన్ని కలిపేసుకొని లేఅవుట్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అనేక ప్రైవేట్ వెంచర్లలో సోగలపల్లె, నందిమండలం, పెండ్లిమర్రి, వెల్లటూరు, ఇసుకపల్లె, తిప్పిరెడ్డిపల్లె, రంపతాడు, మొయిళ్ల కాల్వ తదితర గ్రామాల రెవెన్యూ పరిధిలో ప్రైవేటు వెంచర్లు వెలిశాయి.

మోసపోతున్న జనం

రియల్టర్లు చెప్పే మాయమాటలు నమ్మి జనం అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. అలా కొన్న స్థలంలో ఇల్లు కొట్టుకొని బ్యాంకు రుణం తీసుకోవాలన్నా రాదు. రిజిస్ట్రేషన్ కూడా కాదు. ఇవన్నీ తెలియక జనం ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, శ్మశానాలు ఆక్రమించి వెంచర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యోగివేమన యూనివర్శిటీ వద్ద వేసిన వెంచర్‌లో కాలిబాట, కాల్వను ఆక్రమించి కాంపౌండ్ నిర్మించారని రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. విచారణ చేసి తొలగిస్తాం.

- శ్రీనివాసులు, ఆర్ఐ, పెండ్లిమర్రి

కారు ఢీ... వ్యక్తికి తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు, జూలై 9: మండలంలోని రాఘవరాజపురం వద్ద మంగళవారం కారు మోటారు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో సుధాకర్‌రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొమ్మవరం గ్రామానికి చెందిన సుధాకర్‌రాజు రైల్వేకోడూరుకు తన మోటారు సైకిల్‌లో వస్తుండగా రాఘవరాజపురం వద్ద ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో అతని మోకాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఇద్దరు మృతి




మామిడి సుబ్బారెడ్డి మృతదేహం, ఆత్మహత్యకు పాల్పడ్డ దేవరశెట్టి భాస్కర్

కడప (క్రైం)/ సిద్దవటం, జూలై 9: జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు రైలుకింద పడి మృతి చెందారు. కడప నగరం రైల్వే స్టేషన్ సమీపంలో ఒకరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోగా... వన్‌మాధవరం వద్ద రైలు ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కడప రైల్వే పోలీసుల వివరాల మేరకు... కడప నగరం ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్‌కు చెందిన దేవరశెట్టి భాస్కర్ (52) ఆటోడ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లక్రితం కుమార్తె వివాహ సందర్భంగా చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై మంళవారం ఉదయం కడప రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిద్దవటం మండలం వన్‌మాధవరానికి చెందిన మామిడి సుబ్బారెడ్డి (67) మేకలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మేకలు కాసుకుంటుండగా.. రైల్వేట్రాక్‌పైకి వెళ్లడంతో వాటిని పక్కకు తోలేందుకు పోగా రైలు వచ్చి ఢీకొంది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు మేకలు కూడా మృతి చెందాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

కొత్తపేట రామాపురంలో వ్యక్తి ఆత్మహత్య

రాయచోటిటౌన్, జూలై 9: రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో నివాసం ఉంటున్న ఈశ్వర్‌రెడ్డి (36) అనే వ్యక్తి మంగళవారం తన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం యండపల్లె గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా కొత్తపేట రామాపురంలో నివాసం ఉంటున్నారు. అయితే ఈశ్వర్‌రెడ్డి తండ్రితో పాటు సోదరుడు గతంలో మృత్యువాత పడ్డారు. తల్లి కువైత్‌లో ఉంటోంది. రెండేళ్ల క్రితం ఈశ్వర్‌రెడ్డికి వివాహం అయి నప్పటికీ ఆరు నెలలుగా భార్య ఇతనికి దూరంగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇతనికి మద్యం అలవాటుతో పాటు కొద్దిగా మతిస్థిమితం కూడా సరిగ్గా లేదని బంధువులతో పాటు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇతను సొంత ఇంటిలోనే ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి గడియపెట్టి ముందుగా తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతను కేకలు వేయడంతో పాటు మంటలు పొగ బయటకు రావడంతో చుట్టుపక్కల వారు తలుపు పగలగొట్టి చూశారు. అప్పటికే ఈశ్వర్‌రెడ్డి మంటల్లో కాలి మృతి చెందాడు. సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- ఒకే రాత్రి ఆరు చోట్ల దొంగతనం

ఖాజీపేట, జూలై 9: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె వద్ద సోమవారం రాత్రి ఆరు చోట్ల చోరీలు జరిగాయి. వివరాల్లోకి వెళితే... కోటంగురాయుపల్లె వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాల వారు రోజు దినచర్యలో భాగంగా వ్యాపారం చేసుకుని తాళాలు వేసి వెళ్లిపోయారు. అయితే రాత్రి దొంగలు పైకప్పు ఉన్న రేకులను కట్ చేసి ఆరు దుకాణాల్లోకి దిగి వస్తువులు చిందరవందర చేసి క్యాస్‌పెట్టెల్లో ఉన్న రూ.3 వేలు నగదు తీసుకెళ్లారు. అలాగే బస్టాండులోని హైస్కూలు వెనుకభాగంలో ఉన్న మేడపైన ఇంటికి తాళం పగులకొట్టి రూ.20 వేలు నగదు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ రామాంజులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు ఎర్రచందనం మొక్కలను నాటుకోండి

- మూడేళ్ల వరకు సంరక్షణ బాధ్యత అటవీశాఖదే.. ● రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి

రైల్వేకోడూరు, జూలై 9: రైతు పొలాల్లో నాణ్యత గల ఎర్రచందనం మొక్కలను నాటుకోవాలని, మూడేళ్ల వరకు అటవీశాఖ వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటుందని రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి తెలిపారు. మంగళవారం రైల్వేకో డూరు అటవీశాఖ అతిథిగృహంలో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చెందిన ఖాళీ స్థలాల్లో ఎర్రచం దనం మొక్కలను నాటుకుంటే మంచి రేటుకు అమ్ముకునే అవకాశాలు ఉంటా యన్నారు. గతంలో అటవీశాఖ అనుమతి కోసం కాళ్లు అరిగేలా రైతులు తిరిగే వారని... ప్రస్తుతం ఆ పరిస్థితులు ఉండవని తెలిపారు. రైతుల పొలాల్లో ఎర్రచం దనం మొక్కల పెంపకం చేపట్టిన నాటి నుంచి డేటా ఆన్‌లైన్ ఉంటుందన్నారు. జియోట్యాగ్ చేస్తారన్నారు. మొక్కలు పెరిగిన తర్వాత చెట్లను అమ్ముకోవ డానికి సులువుగా ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. మంచి నాణ్యత కల్గిన విత్తనం ఎంపిక చేసుకోవాలన్నారు. రైతు మొక్కలను నాటి నాటి నుంచి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఎర్రచందనం కొనుగోలు చేసేందుకు చాలా కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. రాజంపేట డివిజనల్ అటవీశాఖ అధికారి వివేక్ మాట్లాడుతూ రైతులందరూ అసోషియేషన్‌గా ఏర్పడి ఎర్రచందనం బొమ్మలను తయారు చేసి అమ్ముకునే అవకాశాలు ఉంటా యన్నారు. చాలా మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో తమిళనాడు రిటైర్డ్ పీసీసీఎఫ్ బాలాజీ, కర్ణాటకకు చెందిన వైఎస్ చాన్సలర్ హన్సిలాల్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, రైల్వేకోడూరు అటవీశాఖ రేంజర్, బాలపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- మంత్రి చొరవతో మూడు గంటల్లో పరిష్కారం
- కృతజ్ఞతలు తెలిపిన రైతు



విద్యుత్తు వైర్లు కిందకు ఉన్నాయని చూపుతున్నరైతు

ఖాజీపేట, జూలై 9: మండలంలోని నాగసానిపల్లె గ్రామానికి చెందిన అబ్బయ్య అనే రైతు గత కొన్ని సంవత్సరాలుగా తన పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం పంట సాగు చేసేందుకు పొలానికి వెళ్లిన రైతు విద్యుత్తు వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఫోటోలు తీసి ప్రసార మాధ్యమాల్లో పెట్టాడు. అది వైరల్ కావడంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వెళ్లాయి. మంత్రి వెంటనే స్పందించి విద్యుత్ తీగలు సరిచేయాలని ఎస్ఈకి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఖాజీపేట ఏఈ మూడు గంటలలోపే సమస్యను పరిష్కరించారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యకు పరిష్కారం దొరకడంతో రైతు మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



రైతు పొలంలో స్తంభం నాటి విద్యుత్ తీగలు సరిచేస్తున్న అధికారులు


పోగొట్టుకున్న బంగారు నగలు అప్పగింత



బాధితులకు నగలు అప్పజెబుతున్న ఎస్ఐ

నందలూరు, జూలై 9: పోగొట్టుకున్న బంగారు నగలును బాధితులకు పోలీ సులు అప్పజెప్పిన సంఘటన సోమ వారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ.. ఆకేపాడు రామిరెడ్డిపల్లెకు చెందిన ఆవుల కిషోర్ రెడ్డి, ఆవుల కవిత సోమవారం రాత్రి సిద్దవటం నుంచి తన స్వగ్రా మానికి వెళుతూ నందలూరులోని క్రిష్ణా స్వీటు షాపులో స్వీట్లు కొనుగోలు చేశారు. తిరిగి ఆకేపాడుకు వెళ్లి చూసుకోగా.. వారి బంగారు నగలు పోయినట్లు గుర్తించారని తెలిపారు. వెంటనే బేకరికి వెళ్లి వెతకగా అక్కడ బ్యాగు కనపడక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో 4 గాజులు, ఒక లాంగ్‌చైన్ మొత్తం 13 తులాల బంగారు ఉందని తెలి పా రు. వెంటనే తాము సీసీ పుటే జిలను పరిశీలించగా... కారులో నుంచి మహిళ దిగే టప్పుడు బ్యాగు పడిపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తీసుకోవడం గుర్తించాం. ఆ వ్యక్తిని పిలిపించి నగల బ్యాగును బాధితులకు అందజేశామని ఎస్ఐ తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం



సంగం, జూలై 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడి మాయమాటలు నమ్మి ఇద్దరు బాలికలు ఇల్లు విడిచి 120 కిలోమీటర్ల దూరం వెళ్లారు. పాఠశాలకు వెళ్లిన బాలికలు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది విచారించారు. పాఠశాలకు రాలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చొరవతో ఎట్టకేలకు ఇద్దరు బాలికలు క్షేమంగా ఇల్లు చేరారు. వివరాల్లోకి వెళితే.. పొదలకూరు మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు స్నేహితులు. వీరు సంగంలోని ఓ పాఠశాలలో ఒకరు పది, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలకని ఇంటి నుంచి వచ్చిన వారు అదృశ్యమయ్యారు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు పాఠశాలలో విచారించారు. ఇద్దరు పాఠశాలలకు రాలేదని తేలింది. అయితే వారిలో ఓ బాలిక తనతల్లి ఫోన్‌ను వినియోగిస్తున్నది. అనుమానంతో ఫోన్‌ను పరిశీలించగా ఓ యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్ నెంబరుతో పోలీసులను సంప్రదించారు. వెంటనే పోలీసులు ఫోన్ సిగ్నల్‌ను కనిపెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. కడప జిల్లా సింహాద్రిపురం వద్ద సిగ్నల్ ఆచూకీ లభ్యమైయింది. ఆ యువకుడి పేరు శివప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. ఫోన్‌లో ఆ యువకుడితో మాట్లాడడంతో ఇద్దరు బాలికలు అక్కడికి చేరినట్లు నిర్ధారణ అయింది. వెంటనే సంగం పోలీసులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడు ఇద్దరు బాలికలను సింహాద్రిపురం బస్టాండ్‌లోని ఓ కూరగాయల దుకాణం వద్ద వదిలేశాడు. సింహాద్రిపురం పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు సోమవారం అర్ధరాత్రి సింహాద్రిపురం బయలుదేరి వెళ్లారు. ఎట్టకేలకు పోలీసుల చొరవతో ఇద్దరు బాలికలు క్షేమంగా ఇంటికి చేరారు. కాగా బాలికలను మాయలో పడేసిన ఆ యువకుడు పరారీలో ఉన్నాడు. ఆ యువకుడికి గతంలోనే వివాహమై భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా విడిపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

- యువకుడి కోసం సింహాద్రిపురం చేరిన ఇద్దరు బాలికలు ● పాఠశాలకని వచ్చి అదృశ్యం
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు ● వారి చొరవతో విద్యార్థులు క్షేమంగా ఇంటికి...



'ఆందోళనను జయప్రదం చేయండి'

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 9 : కార్మిక హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీసుల వద్ద చేపట్టనున్న ఆందోళనను జయప్రదం చేయాల ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులరెడ్డి, మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి యత్నించడం దారుణమన్నారు.

దోమల నివారణకు ఏసీఎం పిచికారీ



కస్తూర్బా గాంధీపాఠశాలలో ఏసీఎం పిచికారీ చేయిస్తున్న సిద్దయ్య

వేముల,జూలై 8: మండల కేంద్రమైన వేముల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో సోమవారం దోమల నివారణకు అల్ఫాసైపర్ మిత్రిన్ పిచికారీ చేసినట్లు సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ హాస్టల్ సెలవులు పూర్తిచేసుకొని పునఃప్రారంభించడంతో ముందస్తు జాగ్రత్త చర్యలుగా జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు అల్ఫాసైపర్ మిత్రన్ పిచికారీ చేయడం జరిగింది. ఈ అల్ఫాసైపర్ మితరన్ పది నుంచి పన్నెండు వారాల వరకు దానియొక్క పని సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. స్ప్రేయింగ్ చేసిన ప్రదేవంలో దోమ వాలితేనిమిషాల్లో చనిపోతుందన్నారు. ప్రిన్సిపాల్ శారద, ఏఎన్ఎం వసుంధర పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ధర్నా

పులివెందుల రూరల్, జూలై 9: మా భూమిని మాకు ఇప్పించాలంటూ బాధిత కుటుంబం తహసీల్దార్ కార్యాయం ఎదుట రెండో రోజు ధర్నా కొనసాగించారు. మంగళవారం కనంపల్లె గ్రామానికి చెందిన బుక్కే కాలే నాయక్, కుమార్తె అగుణమ్మ, కుమారుడు వశ్రమ్‌నాయక్, కోడలు రేష్మాబాయ్, కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు కూర్చున్నారు. తహసీల్దార్ బాధితులను లోపలికి పిలిపించి మాట్లాడారు. మీ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిని పిలిపిస్తానని తహసీల్దార్ చెప్పినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

మహిళ అదృశ్యం



కుసుమ (ఫైల్)

పులివెందుల టౌన్, జూలై 9: మున్సిపాలిటీ పరిధిలోని ప్రైరంగాపురం గ్రామానికి చెందిన శివాజీ, బాబమ్మల కుమార్తె కుసుమ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఆదిత్య బిర్లా కంపెనీలో కుసుమ పనిచేస్తుండేది. ఈమెకు వేముల మండలం కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మేనమామ సాయికుమార్‌తో 30.6.2024న వివాహమైంది. ఈ నేపథ్యంలో సోమవారం కుసుమ ఆదిత్య బిర్లా కంపెనీకి వెళ్లి జీతం డబ్బు తీసుకొని, వారం రోజులు సెలవు తీసుకుని వెళ్లింది. ఇం టికి తిరిగిరాకపోవడంతో ఆమె తల్లి మంగళవారం పులివెందుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిల్పారామంలో సమస్యలు పరిష్కరించండి

కడప (నాగరాజుపేట), జూలై 9 :శిల్పారామంలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, వినోదకరమైన ఆట వస్తువులు మరమ్మతులకు గురయ్యాయని ఆర్‌పీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌పీపీ బృంద సభ్యులతో కలిసి ఆయన శిల్పారామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచే శిల్పారామం కార్మికులకు కనీస వేతనాలు అందడంలేదని, శిల్పారామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తగినంత మంది సిబ్బంది లేరని ఉన్న కొద్దిమందితోనే పనులు సాగిస్తున్నారన్నారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు మడగలం ప్రసాద్, రాయలసీమ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి తస్లిం, నాయకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పీర్లపండుగ తొలి పూజ

వేంపల్లె,జూలై 9: మండలంలోని చింతలమడుగుపల్లె గ్రామంలో పీర్లపండుగను పురస్కరించుకొని ఇమామ్ ఖాసీం స్వామికి 10వ తేదీ బుధవారం స్వామివారి తొలి పూజ జరుగుతుందన్నారు. అలాగే 15వ తేదీన సోమవారం చిన్నసరిగెత్తు, 16వ తేదీన విడిదినం, 17 వతేదీన పెద్ద సరిగెత్తు ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ శివశంకర్

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సమస్యలపై పలువురి వినతి

ఆగిపోయిన పనులను పూర్తి చేయించండి

● మంత్రిని కోరిన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె, జూలై 9: మేజర్ పంచాయతీ అయిన వేంపల్లెలో అసంపూర్తిగా ఉన్న బస్టాండ్ పనులను పూర్తిచేయించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జీవిరమణ కోరారు. మంగళవారం క డప ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉన్న రాష్ట్ర రవాణా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డిని వారు కలిశారు. వేం పల్లెలో రూ.2.32 కోట్లతో బస్‌స్టేషన్ నిర్మాణ పను లు చేపట్టారన్నారు. కాంట్రాక్టర్ మొత్తం పనులు పూర్తిచేశారని, ఇందులో కొంత పని మిగిలిపోయిందన్నారు. వేంపల్లెలో రోడ్ల విస్తరణకు సబంధించి బస్‌స్టేషన్ ఇన్, అవుట్ ఉన్న చోట్ల కాల్వ పనులు చేపట్టకుండా వదిలిపెట్టి వెళ్లారన్నారు. మిగిలిన పనులు పూర్తిచేయించాలని కోరారు. అప్రోచ్ ప నులు పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించినట్లు వారు తెలిపారు.

కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలి: విద్యార్థి, యువజన సంఘం

కడప (ఎడ్యుకేషన్), జూలై 9 : జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని విద్యార్థి, యువజన సంఘ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం కడపకు వచ్చిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఎఐఎస్‌బీ రాష్ట్రప్రధాన కార్యదర్శి జయవర్ధన్ మాట్లాడుతూ లక్షలాది మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కడప జిల్లా ఆకాంక్షలు నెరవేర్చేందుకు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు.

ఆర్టీసీలో ఉద్యోగావకాశాలు కల్పించాలి: అప్రెంటిషిప్ యూనియన్

కడప (మారుతీనగర్), జూలై 9 :ఆర్టీసీ డిపోలు, గ్యారేజీల్లో అప్రెంటిషిప్ చేసిన వారికి ఉద్యోగవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అప్రెంటిషిప్ ట్రేడ్ యూనియన్ ఉమ్మడి కడప జిల్లా ఇన్‌చార్జ్ సయ్యద్ రఫి, జాయింట్ సెక్రటరీ విశ్వనాథ్, గౌరవ సభ్యులు షేక్షావల్లి ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఆర్టీసీ గ్యారేజీల్లో మెకానిక్, కోచ్, బిల్డర్, హమ్మర్‌మ్యాన్ తదితర అప్రెంటీస్ ఉద్యోగాల్లో డైరెక్టు రిక్రూట్‌మెంటు విధానం ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఐటీఐ విద్యార్హతతో ఏపీఎస్ ఆర్టీసీలో గతంలో అప్రెంటిస్ శిక్షణ పూర్తి చేశామన్నారు. 2011 నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ గ్యారేజీలో ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. కావున తమకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

డ్రైవర్లను ఇబ్బంది పెట్టే చర్యలు మాన్పించండి: ఎన్ఎంయూ

కడప (మారుతీనగర్), జూలై 9 : కడప డిపో డ్రైవర్లను ఇబ్బంది పెట్టే చర్యలు మాన్పించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో నాయకులు శ్రీనివాసులు రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. మంగళవారం జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన మంత్రికి వారు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ అధికారులు ఇష్టానుసారంగా డిపో స్థాయి ఏడీసీ పోస్టులను మార్పులు చేశారని ఆరోపించారు. ఆర్టీసీ ఎండీ సర్క్యులర్ ఆదేశాలు అమలు చేయకుండా ఉద్యోగస్తులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. బెంగళూరు పాయింటులో బస్సులకు పార్కింగ్ ప్రదేశం లేనికారణంగా ఆయా బస్సు డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగస్తులకు ఇవ్వాల్సిన 6,12,16,24,30 సంవత్సరాల ఇంక్రిమెంట్లు సకాలంలో కలపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా చేస్తామని మంత్రి వారికి తెలిపారు.

మంత్రిని కలిసిన హరిప్రసాద్

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 9 :కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే శాలువతో సన్మానించారు. మంత్రిని కలిసిన వారిలో రాజంపేట మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: కలెక్టర్



కలెక్టర్ శివశంకర్‌ను సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

కడప (ఎన్జీఆర్ సర్కిల్), జూలై 9 : గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని కలెక్టరు లోతేటి శివశంకర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూ చించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శులు గౌరవ ప్రదంగా కలవడం జరిగింది. ఈ మేరకు కలెక్టరును సత్కరించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ పింఛను పంపిణీలో మంచి ప్రతిభ కనబరిచారని ఇదే స్ఫూర్తితో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అందరూ కష్టపడి పనిచేయడం వల్ల జిల్లాకు మంచి పేరు వస్తుందని అన్నారు. నారాయణరెడ్డి, భాస్కర్, అన్వర్‌బాషా, రాథోడ్ పాల్గొన్నారు.

యూసీఐఎల్‌ను సందర్శించిన ఇంజనీరింగ్ విద్యార్థులు



విద్యార్థులతో యూసీఐఎల్ అధికారులు

వేముల, జూలై 9: మండలంలోని తుమ్మలపల్లె వద్ద నున్న యూసీఐఎల్‌ను భువనేశ్వర్‌లోని అన్నా విశ్వ విద్యాలయం, ఎస్‌వీఎస్‌ఈటిలోని వివిధ విద్యార్థులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా యూసీఐఎల్ అధికారులు మాట్లాడుతూ యూసీఐఎల్ యూనిట్ 2024 నుంచి 2025 వరకు ప్లాటినం జూబ్లీ వేడుకల కింద అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు యూసీఎల్ ప్లాంట్‌లను చూపించారు. ఈ కార్యక్రమంలో మిల్ డీజీఎం సుమన్ సర్కార్, గనుల డీజీఎం కిషోర్ భగత్, అదనపు సూపరింటెండెంట్ విపిన్‌కుమార్ శర్మ, ఎన్‌వీఈఎస్ బాబు గని మానగర్, కె. నాగరాజు, ఎన్.వి.రాజేష్, సోంజోయ్ ఛటర్జీ, పి.కె.నాయక్ పాల్గొన్నారు.

ఖాజీపేట హైస్కూలు హెచ్‌ఎం

సస్పెన్షన్‌ను రద్దు చేయండి: ఫ్యాప్టో



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 9 : కలుషితమైన నీరు తాగి విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే కారణంగా ఖాజీపేట బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాదేవిపై విధించిన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ఫ్యాప్టో ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్, డీఆర్వో కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ విజయకుమార్, సెక్రటరీ జనరల్ మహ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ ఆ ఘటనలో ప్రధానోపాధ్యాయురాలి తప్పు లేదన్నారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు పలువురు విద్యార్థులు తాగినప్పటికీ కేవలం ముగ్గురు, నలుగురు మాత్రమే అస్వస్థతకు లోనయ్యారన్నారు. వర్షాకాలం ప్రారంభమై కొన్ని ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. డయేరియా ద్వారా కొంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. ఈ ఘటనకు ప్రధానోపాధ్యాయరాలిని బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఇలియాస్‌బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు, జిల్లా కార్యదర్శి సీవీ రమణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదుల్లా పాల్గొన్నారు.

కేసు నమోదు

కడప (క్రైం), జూల్ 9: కడప నగరంలోని మునిరావు వీధిలో దుకాణంపై దౌర్జన్యం చేసి వస్తువులను తీసుకెళ్లిన వారిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. చీమలపెంటకు చెందిన చంద్రశేఖర్ మరికొందిరితో కలిసి ఈనెల 7న జిరాక్స్ సెంటర్‌లోకి దూరి అందులో ఉన్న మెషిన్లను తీసుకెళ్లారు. బాధితుడు ప్రవీణ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అందరికీ అందుబాటులోకి ఇసుక: ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి



ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, జూలై 9: ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సామాన్య ప్రజలకు అందుబాటులోకి ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పగడాలపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఇసుకడంపు వద్ద ఎమ్మెల్యే ఉచిత ఇసుక పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నెలలోపే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. కొత్తగంగిరెడ్డిపల్లె, పగడాలపల్లె వద్ద స్టాక్‌పాయింట్లు ఉన్నాయని, ఇక్కడ నుంచి ఇసుక సరఫరా అవుతుందన్నారు. కమలాపురం నియోజకవర్గ టీడీపీ యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ఆరవేటి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన బీటెక్ రవి



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి

పులివెందుల టౌన్, జూలై 9: విజయవాడలోని పలువురు మంత్రులను మంగళవారం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి కలిశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమల, మార్కెటింగ్, సహ కార,మత్స్యకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడును, రెవెన్యూ శాఖా మంత్రి సత్యప్రసాద్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారికి నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. సమస్యలన పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రులు వివరించినట్లు బీటెక్ రవి తెలిపారు.

రిమ్స్ జూడాల నూతన కమిటీ ఏర్పాటు



నియామకపత్రాలను అందిస్తున్న డాక్టర్ సురేఖ

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 9 : కడప ప్రభుత్వ వైద్యశాల జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ మంగళవారం నూతన కమిటీని ఏర్పాటు చే సింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఖదీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ అశ్విని, డాక్టర్ అల్లూరి నిఖిల్‌సింగ్ ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్‌లు విష్ణుప్రసాద్, విష్ణువర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు సమస్యలను ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మహిళామండలి సేవ మరువలేనిది

● 20 మందికి వీల్‌ఛైర్లు పంపిణీ

వేంపల్లె,జూలై 9: చైతన్యమహిళా మండలి సేవలు మరువలేనిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లె భవిత కేంద్రంలో రెండు లక్షల రూపాయల విలువైన 20 మంది వీల్‌ఛైర్‌లను చైతన్య మహిళా మండలి అందజేసింది. ఈ సందర్భంగా ఐఈఆర్టీ కోఆర్డినేటర్ కేశవరెడ్డి, ఎంఈఓలు జాఫర్‌సాదిక్, స్టాలన్ ఐజాక్, మేరీ ఎస్తేర్, స్టీఫెన్ పాల్, నాగన్న మాట్లాడుతూ చైతన్య మహిళామండలి వారిచే పేద బడుగుబలన వర్గాల అభ్యున్నతి కోసం మహిళలు బాలబాలికల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. వీరిద్వారా ఉచితంగా గ్రామీణ మహిళలకు వితంతు మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి ఉచితగా టైలరింగ్ మిషన్లు కూడా అందజేస్తామన్నారు. ఎంతోమంది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించారన్నారు. ఇలాంటి సేవాకార్యక్రమాలు మరిన్ని చేయాలని కోరారు. ఈ కార్యాక్రమంలో రామాంజనమ్మ, మాణిక్యరావు, మెయిన్ స్కూల్ హెచ్‌ఎం రాజశ్వరి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఆనంద, ఐఈఆర్టీలు యశోద, సుజాత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానం భవన నిర్మాణ కార్మికుల విజయం

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వికాస్ హరి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 9 :టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసక విధానం భవన కార్మికుల విజయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ తెలిపారు. మంగళవారం 45వ డివిజన్ తారకరామనగర్‌లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడి చిత్రపటానికి భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వికాస్ హరిక్రిష్ణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో కార్మికరంగం కుదేలైందన్నారు. కార్మికులు జీవనోపాధి కోల్పోయి పక్కరాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు. వైసీపీ నాయకులు కోట్ల రూపాయలు దండుకున్నారన్నారు. ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో కార్మికులందరూ జీవనోపాధి పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ టీడీపీ నాయకులు పవన్, ప్రతాప్, శ్రీను, అనిల్, ఉదయ్, హర్షతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పుత్తా నరసింహారెడ్డి

పెండ్లిమర్రి, జూలై 9: సాధారణ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకెళ్తున్నాడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసంహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొందిపల్లె గ్రామంలో మంగళవారం టీడీపీ నేత మాచవరం రామ్మోహన్‌రెడ్డి ఇచ్చిన విందుకు పుత్తా నరసింహారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి వచ్చే సమస్యలను పరిష్కరిస్తామని అలాగే గ్రామాల్లో మౌళిక వసతులతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు.

విజయదుర్గా ఆలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి.. రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప (కల్చరల్), జూలై 9 : కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

21న అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం

ఆషాడ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 21న ఆలయంలో అమ్మవారికి పవిత్ర నదీ జలాలు నింపిన 108 విశేష కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం మండల దీక్ష, మాల విరమణ, బ్రహ్మయజ్ఞ మహాపూర్ణహుతి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపకుడు మల్లిఖార్జున తెలిపారు. కావున అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని అర్చకులు కోరారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసిన తుంగా రమణయ్య



ఎమ్మెల్సీని కలిసిన జనసేన నేత తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), జూలై 9: విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను జనసేన నాయకుడు తుంగా రమణయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్న హరిప్రసాద్ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను కలిసి అభినందలు తెలిపారు. అనంతరం తుంగా రమణయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కడప నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు జనసేన కీలక పాత్ర పోషించిందన్నారు. చాలా మంది జనసేన నాయకులు పార్టీ నిర్ణయానికి కట్టుబడి ని స్వార్థంగా పనిచేశారన్నారు. కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్సీని కోరినట్లు తెలిపారు.

నారా లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి



మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), జూలై 9 : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. కడప కేంద్రంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని లోకేశ్‌ను కోరారు. నిరుద్యోగులకు విరివిగా ఉపాధి లభించేలా పరిశ్రమలు తీసుకురావాలని కోరినట్లు ఆమె తెలిపారు. అందుకు లోకేశ్ సానుకూలంగా స్పందించారని ఆమె వివరించారు.

నిబంధనలు అతిక్రమించి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ నాయక్

వేంపల్లె, జూలై 9: నిబంధనలు అతిక్రమించి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నాయక్, సీఐ చాంద్ బాషా హెచ్చరించారు. వేంపల్లె ఎంపీడీఓ సభాభవనంలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకుజిల్లాలో 11 ఇసుక డంపింగ్ యార్డులు ఉన్నాయని, అక్కడ నుంచి మాత్రమే తరలించుకోవాలని సూచించారు. వేంపల్లెకు సమీపంలో వీరపునాయునిపల్లె, పులివెందుల నుంచి ఇసుక తరలించుకోవచ్చని తెలిపారు. నేరుగా ఇసుకను తీసుకెళ్లేందుకు స్థానిక పాపాఘ్ని నదికి ఎవరు వెళ్లకూడదని అలా వెళితే ప్రభుత్వ ఆదేశాలమేకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుక తెచ్చుకోవాలని తెలిపారు. ఆర్ఐ లోకేష్ పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

కడప (ఎడ్యుకేషన్), జూలై 9: కడప నగరానికి చెందిన లింగాల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఆయన మేనకోడలు సింగిరెడ్డి శ్రీలక్ష్మి, ఆమె భర్త అమ్మిరెడ్డి సుధాకర్‌రెడ్డి తరఫున లింగాల కొండారెడ్డి, కుమారుడు వంశీక్రిష్ణారెడ్డి సీపీ బ్రౌన్ గంథాలయానికి పుస్తకాలను సంచాలకులు ప్రొఫెసరు టి.రాంప్రసాద్‌రెడ్డికి అందించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: పీఆర్‌టీయూ



ఆర్‌జేడీని సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కడప(ఎడ్యుకేషన్), జూలై 9 : జిల్లాలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మోపూరి వెంకటశివారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ కన్వీనరు గుజ్జల తిరుపాల్, రాష్ట్ర కౌన్సిలరు ఎన్.లక్ష్మీకాంత్ కోరారు. మంగళవారం ఆర్‌జేడీ కార్యాలయంలో నూతనంగా ఆర్‌జేడీ బాధ్యతలు చేపట్టిన శ్యామ్యూల్‌ను వారు కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలను ఆర్‌జేడీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్‌జేడీ స్పంది స్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ నాయకులు కందుల వెంకటసుబ్బారెడ్డి, హరినాథ్‌బాబు, అజీదుద్దీన్, చంద్రమౌళి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'పీఎఫ్ అధికారులు మొద్దునిద్ర వీడాలి'



ఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప (ఎడ్యుకేషన్), జూలై 9 : పీఎఫ్ అధికారులు మొద్దునిద్ర వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల సంఘం నగర అధ్యక్షుడు సుంకర రవి డిమాండ్ చేశారు. మంగళవారం కార్పొరేషన్ ఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఎంహెచ్‌ఓకు ఆయన వినతిపత్రం అందించారు.
అనంతరం మాట్లాడుతూ కార్మికుల పీఎఫ్ విషయంపై గత ఎనిదేళ్లుగా ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు ఉన్న వాటిని మార్పులు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ తప్పులను సరిదిద్దడంలో పీఎఫ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తు న్నా రన్నారు. కడప జిల్లాలో రీజనల్ కార్యాలయం ఉన్నా ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కరించడంలో అధికారులు, కమిషనరు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కమిషనరుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు.

అదుపుతప్పి ట్రిప్పర్ బోల్తా- డ్రైవర్ మృతి



మృతిచెందిన గంగాధర్

పెండ్లిమర్రి, జూల్ 9: మండల పరిధిలోని కడప-పులివెందుల ప్రధాన రహదారిపై చీమలపెంట వద్ద ట్రిప్పర్ అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవర్ గంగాధర్(21) మృతిచెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీసి రిమ్స్‌కు తరలించారు.



మంగళవారం కడపలో జరిగిన జడ్పీ సమావేశంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్ తదితరులు

భవిత సేవలు సద్వినియోగం చేసుకోండి :ఎంఈవో

ఎర్రగుంట్ల, జూలై 9: దివ్యాంగులు భవిత కేంద్రం సేవలను తప్పకుండా వినియోగించుకోవాలని ఎంఈవోలు శివప్రసాద్, వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కేంద్రంలో నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపి క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాల వయసుగల దివ్యాంగులందరూ ఇక్కడి వచ్చి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చెవిటి,మూగ, మానసిక, అంగవైకల్యం గల పిల్లలందరినీ భవిత కేంద్రంలో చేర్పించాలన్నారు. బడిలో పేరు నమోదు చేయించిన వారికి ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, రీడర్ అలవెన్స్, గర్ల్ స్టైఫండ్, హోం బేస్డ్ స్టైఫండ్ తదితర అలవెన్సులు ప్రభుత్వం ద్వారా అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.సతీష్‌కుమార్‌రెడ్డి, ఉఈఆర్‌పి రవికుమార్‌లు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్క నాటి పెంచాలి

కలసపాడు, జూలై 9 : ప్రతి విద్యార్థి బాధ్యతగా మొక్క నాటి పెంచాలని ప్రధానోపాధ్యాయుడు కమాల్ పేర్కొన్నారు. పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ అధికారి రఘునాథరెడ్డి తన సిబ్బందితో మంగళవారం కలసపాడు మండలం ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులచే మొక్కల ఆవశ్యకత, పర్యావరణంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసులు, సెక్షన్ అధికారి రమణయ్య, బీట్ అధికారులు హసన్‌బాషా, కరుణాకర్, రత్నసుభాషిణి, మల్లికార్జున, టీచర్లు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన మున్సిపల్ స్థలాలను స్వాధీనపరచుకోవాలి

జమ్మలమడుగు, జూలై 9: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో కబ్జాలకు గురైన ప్రభుత్వ మున్సిపల్ స్థలాలను అధికారులు వెంటనే చర్యలు తీసుకుని స్వాధీనం చేసుకోవాలని జమ్మలమడుగు సీపీఐ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మలమడుగు సీపీఐ కార్యాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు, పొలాలు కబ్జాకు గురయ్యాయన్నారు. పెద్దపసుపుల రోడ్డు, ముద్దనూరు రోడ్డు, పాత బస్టాండు సర్కిల్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో మున్సిపల్ స్థలాలన్నీ ఆక్రమించారన్నారు. అదే విధంగా జమ్మలమడుగు, మైలవరం, గండికోట, పెద్దముడియం, తదితర ప్రాంతాల్లో స్థలాలు గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురయ్యాయన్నారు. గతంలో కబ్జాలకు సహకరించిన అధికారులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సీపీఐ తరుపున తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం




కొలువుదీరిన పీర్లు

ముద్దనూరు జూలై9: స్థానిక రైల్వే గేట్ల వద్ద నున్న పీర్ల చావిడిలో మొహర్రం పండుగ సందర్భంగా పీర్లు కొలువు దీరాయి.మంగళవారం నుంచి ఆదివారం వరకు చావిడిలో పీర్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై14,15వ తేదీ ఆది,సోమవారం సాయంత్రం గ్రామంలో ఊరేగింపు(చిన్న సరగత్తు),16వతేదీ మంగళవారం విడిదినం సాయంత్రం 5గంటలకు అబ్దుల్‌ఖాదర్(ఫేమస్ బ్రదర్స్)ఇంటి వద్ద బ్యాండ్ వాయిద్యాలతో స్వాములవారికి ఊరేగింపుగా పాల షరబత్, పూలా షహారాలు చదివింపులు తీసుకొని వెళతారు. అదే రాత్రి గుండం కాల్చే కార్యక్రమం,.17వ తేదీ తెల్లవారుజామున పీర్లు గుండంలో దిగుట,మధ్యాహ్నం ఊరేగింపుగా పీర్లు యేటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని మొహర్రం కమిటీ వారు తెలిపారు.

ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో కార్పొరేట్‌స్థాయిలో వైద్యసేవలు అందేలా చూడాలి

సత్యకుమార్‌ను కలిసి విన్నవించిన ఎమ్మెల్మే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు , జూలై 9 : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందేలా చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ ను ఎమ్మెల్యేవరదరాజులరెడ్డి కోరారు. ఆమేరకు మంగళవారం రాష్ట్ర రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో మంత్రి సత్యకుమార్‌ను మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కలిశారు. ప్రొద్దుటూరు వాసిగా ప్రొద్దుటూరులో వైద్య ఆరోగ్యసేవలు మెరుగు పరిచేందుకు తప్పక కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ ను ప్రభుత్వంలో వేగవంతంగా జరిగేందుకు కృషి చేస్తానని తెలిపినట్లు ఆయన తెలిపారు.

మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కలసపాడు, జూలై 9 : మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని ఏవో షరీఫ్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాజుపాలెం, చెన్నుపల్లె, బ్రాహ్మణపల్లె తదితర గ్రామాల్లో మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేత దశలో ఆకులు ఉన్నప్పుడు చిత్తపురుగులు వచ్చి ఆకులపై రంధ్రాలు చేసి పంటను నష్టపరుస్తాయన్నారు. పేనుబంక, కాండంపై ఏర్పడి రసం పీలుస్తాయని తెలిపారు. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ లేదా అస్ఫేట్ లీటరుకు 1.5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. పల్లాకు తెగులు కూడా వస్తుందని ఈ వైరస్ తెల్లదోమ ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. నివారణకు ఎసిటామిప్రిడ్ లేదా టోనికామిడ్ పిచికారీ చేసుకోవాలన్నారు. గట్లపై ఉన్న పిచ్చిమొక్కలు తొలగిస్తే పంటకు తెగుళ్ల సోకడం తగ్గుతుందని తెలిపారు.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్ సిగ్నల్స్

గ్రీన్ ఎప్పుడు పడుతుందో, రెడ్ ఎప్పుడు పడుతుందో తెలియని వైనం ● అయోమయంలో వాహనదారులు



బద్వేలు పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి

బద్వేలు రూరల్, జూలై 9 : పట్టణాల్లో రద్దీగా ఉన్న కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా వాహనాలు క్రమబద్ధంగా నడుస్తాయి. తద్వారా ప్రమాదాలను కూడా నివారించవచ్చు. అయితే అందుకు భిన్నంగా బద్వేలు పట్టణంలోని నాలుగురోడ్లకూడలిలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ అస్తవ్యస్తంగా మారాయి. రెడ్‌సిగ్నల్ ఎప్పుడు పడుతుందో తెలియదు, తరువాత గ్రీన్‌సిగ్నల్ ఎప్పుడు పడుతుందో తెలియక వాహనదారులు తమ వాహనాలను ట్రాఫిక్ సిగ్నల్స్ వరకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రీన్‌సిగ్నల్ పడ్డ వైపు వాహనాలు అవతలి వైపు వెళ్లేందుకు అడ్డంకి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడి ట్రాఫిక్ గజిబిజిగా తయారవుతోంది. అయితే సమస్యపై సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

సిగ్నల్స్ వద్ద వాహనదారుల ఇక్కట్లు..: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్‌సిగ్నల్స్ ఏర్పాటు ఓ వైపు 90 సెకన్లకు, మరో వైపు 120 సెకన్ల పైబడి మరోవైపు 60 సెకన్ల పైబడి, మరో వైపు 25 సెకన్లు మాత్రమే సిగ్నల్స్ పడేలా ఏర్పాటు చేశారు. అయితే నిర్ణీత సమయానికి సిగ్నల్స్ పనిచేయకపోవడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఏవైపు చూసినా కూడా నిర్ణీత సమయం చూపిస్తుంది, కానీ నిర్ణీత సమయం దాటినా కూడా రెడ్‌సిగ్నల్ పడుతుండడంతో వాహనదారులు అయోమయంలో పడుతున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు..: పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ అయితే ఏర్పాటుచేశారు కానీ వాటి పర్యవేక్షణ మున్సిపాలిటీదా, లేక పోలీసు డిపార్ట్‌మెంటుదా అన్న విషయం ఇప్పటికీ తేలడంలేదు. అయితే ట్రాఫిక్ నియంత్రించే విధులు పోలీసు డిపార్ట్‌మెంటుదే కనుక సిగ్నల్స్ వద్ద పర్యవేక్షిస్తున్న పోలీసులు సిగ్నల్స్ క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలా, లేదంటే మున్సిపాలిటీ వారు చేపట్టాలా అనే విషయమే ఇంకా తేలలేదు. వాహనదారులు మాత్రం ఎవరూ పట్టించుకోలేదన్న ఆరోపణలతో కాలం వెళ్లదీస్తున్నారు.

ప్రమాదాలు జరగవా..?: ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పడక ముందు నాలుగురోడ్ల కూడలిలో అడపా దడపా వాహనాలు ఢీకొనడం, వాహనం కింద పడి ఓ వ్యక్తి మృతి చెందడం వంటి ఘటనలు చిన్న,చిన్న ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఎన్నో ఏళ్ల అనంతరం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొంత కాలం పనిచేయకుండా ఆగిపోవడం, పనిచేస్తున్నప్పటికీ నిర్ణీత సమయంలో సిగ్నల్స్ పడేలా పనిచేయకపోవడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా అయితే సిగ్నల్స్ ఉన్నప్పటికీ ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదని వాహనదారులు పేర్కొంటున్నారు.

సిగ్నల్స్ ఉన్నా ప్రయోజనం ఏమిటి..: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఓ వైపు జాతీయ ప్రధాన రహదారి మరో రెండుదారులు పట్టణంలోని ఈ వైపు నుంచి ఆవలికి వెళ్లే దారి. అయితే జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సిగ్నల్స్ ఏర్పాటు చేసిన తరువాత క్రమబద్ధంగానే వాహనాలు నడుస్తున్న నేపథ్యంలో సిగ్నల్స్ మరమ్మతులకు గురికావడం, లేదంటే అవి సరిగా పనిచేయకపోతున్నాయి. దీంతో సిగ్నల్స్ ఉన్నా ఉపయోగం ఏమిటని వాహనదారులు, పాదచారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సిగ్నల్స్ మరమ్మతులు చేయించి వాహనాలు క్రమబద్ధంగా నడిచేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకున్న సీఎం





ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య, బద్వేలులో మాట్లాడుతున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

ప్రొద్దుటూరు ,జూలై 9: వైసీపీ దోపిడీ ఇసుక పాలసీని జీవో 43తో రద్దు చేసి చంద్ర బాబుప్రజలకు ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ బచ్చల పుల్లయ్య పేర్కొ న్నారు.మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక వనరును ప్రజలకు అందుబాటులో వుంచకుండా రెండు బినామీ కాంట్రాక్ట్ కంపెనీలకు అప్పగించి ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించి వేల కోట్ల ఇసుక దోపిడీకి పాల్పడ్డారన్నారు. ఇందువల్ల భవననిర్మాణ కార్మికులు ఇసుక లేక రాష్ట్రంలో ఉపాధి కోల్పోయిన పరిస్థితిని జగన్ సృష్టించారన్నారు.అందుకే రాష్ట్రంలో ప్రజలు, కార్మికుల కష్టాలు తెలుసుకున్న చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందజేయాలని తలచారన్నారు. అందులో బాగంగా రాష్ట్రంలో నదుల్లో ఇసుక వున్న చోట ఇసుక యార్డులను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ పద్ధతుల్లో ప్రజలు బుక్ చేసుకుని కేవలం రవాణా సీనరేజ్ జీఎస్‌టీ చార్జీలు చెల్లించి తీసుకోవచ్చన్నారు. ఇసుక పాలసీని పూర్తి స్థాయిలో ఇంకా తయారు చేయలేదని ప్రస్తుతానికి ఇంటీరియమ్ పాలసీని తెచ్చి ఇసుక అందుబాటులో వున్న చోట ప్రజలకు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఇందువల్ల ఎవ్వరూ అక్రమంగా ఇసుకను ఇతర రాష్ట్రాలకు తరలించడంకానీ ఇసుక వ్యాపారంగా మార్చుకోవడంకానీ చేయకుండా అరికట్టడం జరుగుతుందన్నారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఇసుక పాలసీ: మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలుటౌన్,జూలై 9 : చరిత్రలో నిలిచిపోయేలా ఇసుకపాలసీకి చంద్రబాబు శ్రీకారం చుట్టడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం లో విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు ఉచితంగా ఇసుకను అందించేందుకు ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురావడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుకపాలసీని అందించి భవనకార్మికుల మనసును గెలుచుకున్నారన్నారు. ఉచిత ఇసుక విధానంతో సామాన్య ప్రజలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పార్థసారథి, టీడీపీ నాయకులు భైరవప్రసాద్, నారాయణ, లక్షుమయ్య, ప్రసాద్, తదితరులుపాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పోరుమామిళ్ల, జూలై 9: స్థానిక ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారులు సంయు క్తంగా తనిఖీలు నిర్వహించి నాలుగు షాపులు సీజ్ చేశారు. మంగళవారం పోరుమామిళ్లలో తిరుపతి విజిలెన్స్ అధికారి ప్రసాద్, పోరుమామిళ్ల వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారి వరహరికుమార్ బృందం ఎరువుల దుకాణాల తనిఖీ చేపట్టారు. ఓ దుకాణం తనిఖీ చేస్తున్నారని తెలియడంతో మిగిలిన వారు తమ షాపులకు తాళాలు వేసి పలాయనం చిత్తగించారు. అధికారులు ఆ షాపుల యాజమానులకు ఫోను చేయగా, తాము అందుబాటులో లేమని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నామని బుకాయించారు. దీంతో ఆగ్రహించిన విజిలెన్స్ అధికారులు నాలుగు దుకాణాలను సీజ్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బ ద్వేలు, జూలై 9: బద్వేలు పట్టణ పరిధిలోని హెచ్‌పీ పెట్రోలు బంక్ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రూ.10వేలు అపరాధ రుసుం విధించినట్లు ఎక్సైజ్ సీఐ మృదుల, గోపవరం తహసీల్దారు రోశయ్య తెలిపారు. ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వెంకటక్రిష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆమె తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, జూలై 9: జమ్మలమడుగు డివిజన్ కేంద్రమైన మున్సిపాలిటీ పరిధిలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలోని పరిపాలన అధికారి వెంకటలక్షుమ్మకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో ఆధార్ కేంద్రాలు లేకపోవడం వలన విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారన్నారు. జమ్మలమడుగుకు చెందినవారు ఆళ్లగడ్డ, పెద్దముడియం ప్రాంతాలకు వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు పాల్గొన్నారు.

బేస్‌మట్టం తొలగించడంపై డీఎస్పీ విచారణ



కోనరాజుపల్లె గ్రామస్థులను విచారిస్తున్న మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు

అట్లూరు, జూలై 9 : తన బేస్‌మట్టం దౌర్జన్యంగా తొలగించారంటూ మండలంలోని మాదా పూర్ పంచాయతీ కోనరాజుపల్లెకు చెందిన అంధుడైన పున్నగాని అయ్యవారయ్య ఈ నెల 3న డీజీపీకి,లోకేశ్‌బాబుకు ఫిర్యాదు చేయడంతో మైదుకూరు డీఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. అయ్యవారయ్యకు 2023 నవంబరులో 1022 సర్వేనెంబరు 11వ ప్లాట్‌లో రెండు సెంట్లు డీఫారం రెవెన్యూ అధికారులు ఇచ్చారన్నారు. ఆ స్థలంలో బేస్‌మట్టం ఏర్పాటు చేసుకున్నానని గ్రామంలో తనంటే గిట్టని వారు బేస్‌మట్టాన్ని పగలగొట్టారని ఫిర్యాదు చేశారు. కాగా రెవెన్యూ అధికారులు ఆర్ఐ కరీముల్లా వీఆర్వోదస్తగిరి రికార్డులను పరిశీలించగా అయ్యవారయ్యకు డీఫారం పట్టా ఇచ్చినట్లు రికార్డుల్లో నమోదు లేదన్నారు. ఆ స్థలం గ్రామకంఠంగా నమోదు ఉండడంతో డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారించగా గుడి ఎదురుగా ఉన్న స్థలం గుడికి కేటాయించినట్లు గ్రామస్థులు డీఎస్పీ ఎదుట తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేలు సీఐ విక్రమసింహ, అట్లూరు ఎస్ఐ కేసీ రాజు తెలిపారు.

బీసీ బాలికల వసతి గృహాన్ని త్వరలో ప్రారంభిస్తాం



నైట్ షెల్టర్‌లో మరమ్మతులను పరిశీలిస్తున్న క్రిష్ణయ్య

ప్రొద్దుటూరు టౌన్, జూలై 9: అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని నైట్ షెల్టర్‌లో బీసీ బాలికల వసతి గృహాన్ని త్వరలో ప్రారంభిస్తామని బీసీ సంక్షేమ శాఖ డివిజ న్ అధికారి క్రిష్ణయ్య తెలిపారు. సోమవారం బీసీ బాలికల వసతి గృహ విద్యార్థినులు హాస్టల్‌ను త్వరగా ప్రారంభించాలని తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన మంగళవారం నైట్‌షెల్టర్‌లో చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నైట్‌షెల్టర్‌లో వసతి గృహం ఏర్పాటు చేస్తే విద్యార్థినులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. నైట్‌షెల్టర్‌లో మరమ్మతులతోపాటు మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో వసతి గృహాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహం వార్డెన్ సత్యవతి, గంజికుంట నాగరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మైదుకూరు, జూలై 9 : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు తరువాత తొలిసారిగా బుధవారం మైదుకూరులో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన పుట్టా సుధాకర్ యాదవ్ మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా మైదుకూరు మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డుల్లో 24 మంది కౌన్సిలర్లున్నారు. వీరిలో టీడీపీకి 12 మంది, వైసీపీకి 11 మంది, ఒకరు జనసేన సభ్యుడికాగా గెలుపొందారు. కాగా 6వ వార్డులో టీడీపీ నుంచి గెలుపొందిన మహబూబ్‌బీ వైసీపీకి మద్దతు ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో మున్సిపల్ చైర్మెన్ పీఠాన్ని వైసీపీ కైవసం చేసుకుంది. కాగా టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధ్యక్షతన బుధవారం జరుగనున్న తొలి మున్సిపల్ సమావేశం మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనుల పేరిట జరిగిన అవకతవకలు, ఇతరత్రా వాటిపై సభ్యులు చర్చించే అంశంతో పాటు, చైర్మన్ పీఠంపై కూడా ఉత్కంఠంగా సాగనున్నట్లు తెలుస్తోంది.

నేడు రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళనలు

బ ద్వేలు, జూలై 9: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి వారి హక్కులను కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్న ందుకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలోని అన్ని తహసీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిన్ని, ఆంజనేయులు, సుబ్బరాయుడు, సుబ్బయ్య, ఫాతిమా పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

బ ద్వేలు, జూలై 9: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డులలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి తక్షణమే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త బి.రమేష్, స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



ప్రొద్దుటూరు టౌన్, జూలై 9: విద్యార్థుల సమస్యలతో పాటు జాతిపునర్నిర్మాణమే ధ్యేయంగా ఏబీవీపీ పనిచేస్తోందని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొప్పూరు మల్లికార్జున పేర్కొన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ బాగ్ కన్వీనర్ చరణ్‌కుమార్, నగర కార్యదర్శి శివనారాయణ, హాస్టల్ కన్వీనర్ శ్రావణ్, సోహెల్, వెంకటేష్, మహేష్‌బాబు, సంతోష్, అభినయ్, తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: దేశ పునర్నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనరు అభిలాష్ పేర్కొన్నారు. మంగళవారం ఏబీవీపీ పోరుమామిళ్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర డిగ్రీకళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివేకానంద భవన్ వద్ద ఏబీవీపీ 76వ ఆవిర్భావదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా నాయకులు బాలరంగయ్య, శ్రీనివాసరెడ్డి, రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేను అవినీతికి పాల్పడను... మీరూ పాల్పడవద్దు

● అవినీతికి పాల్పడితే క్రిమినల్ కేసులు ● మండల సర్వసభ్యసమావేశంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

ఖాజీపేట, జూలై 9: 'నేను అవినీతికి పాల్పడను... మీరు కూడా ఎక్కడా అవినీతికి పాల్పడకుండా ప్రజలకు సేవ చేయాలని' మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సిద్ధిక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికోసం ప్రతి నాయకుడు కష్టపడాలని, అభివృద్ధికోసం పార్టీలకతీతంగాపనిచేయాలన్నారు. మిమ్మల్ని, నన్ను ఎన్నుకున్నది ప్రజలేనని, ఇంతవరకు ఏమి జరిగిందో వద్దని, ఇప్పటి నుంచి నిజాయితీగా ప్రజలకు పనిచేయాలని అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. అంతేకానీ అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ సిద్ధిక్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో మీటింగ్‌హాల్, బాలికోన్నత పాఠశాలలో మినరల్ వాటర్‌ప్లాంట్ లేదని అన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు 15 రోజులలోపు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంఈవో స్వర్ణలత మాట్లాడుతూ మండల పరిధిలో ఆంజనేయకొట్టాలు, పాత ఏటూరు స్కూలు భవనాలు లేవని, మరికొన్ని స్కూళ్లలో మినరల్ వాటర్‌ప్లాంట్లు లేవని అన్నారు. తహసీల్దారు వెంకటలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలో డీలర్లు లేకపోయినా వారం రోజుల్లో 80 శాతం పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి మాట్లాడుతూ మండల పరిధిలో డీలర్లు అంగన్వాడీ సెంటర్లకు వచ్చే బియ్యం, కందిబేడలు, నూనె సక్రమంగా ఇవ్వడంలేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి పనితీరు మారలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటిని వృథా చేయకండి..పుట్టా

ఖాజీపేట, జూలై 9: మంచినీటిని వృథా చేయవద్దని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం పేరారెడ్డి కొట్టాలులో మంచినీటి పథకాన్నిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, నాయకులు చంద్ర ఓబుళరెడ్డి, హరినాథరెడ్డి, పుల్లయ్యనాయుడు, జానకీరాం, జెండాల మాబాష, గౌస్, శంకర్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, వీరయ్య, రాము, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.